ప్రజాశక్తి
శనివారం 9 మార్చి 2024 5
అనంతపురం

- జగన్ వంద పథకాలు రద్దు చేశారు..
- టిడిపి రాగానే అనంతను సస్యశ్యామలం చేస్తాం
- ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు
- టిడ్కో గృహాలను పేదలకు అందజేస్తాం
- శంఖారావంలో నారా లోకేష్

వైసిపిది కోతల పాలన

ప్రజాశక్తి-కొత్తచెరువు, కదిరి అర్బన్

'2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాగానే అప్పటి వరకు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను కట్ చేసింది. దాదాపు వంద సంక్షేమ పథకాలను రద్దు చేసింది. పేదలకు అందే సాయాన్ని దూరం చేసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా కటింగ్ పాలనను సాగిస్తున్నారు.' అంటూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శంఖారావం యాత్రలో భాగంగా శుక్రవారం నాడు ఆయన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ముందుగా పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం కొత్తచెరువు, కదిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను రద్దు చేశారన్నారు. పెళ్లికానుకలు, పండుగ కానుకలు, స్కూల్ ఫీజురీయింబర్స్ మెంట్, డ్రిప్ ఇరిగేషన్ తదితర వాటిని జగన్మోహన్‌రెడ్డి కట్ చేశారన్నారు. ఇలా 100 సంక్షేమ పథకాలు కట్ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో కరెంట్ ఛార్జీలు 9 సార్లు పెరిగాయన్నారు. ఇంటి పన్ను, చెత్తపన్నులను పెంచేశారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యులను బాదేశారని తెలిపారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి అయిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ జరగలేదన్నారు. టీడీపీ హయాంలో జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తే నేడు నిలిపివేశారని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లాను అభివద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అన్నారు. 1.30వేల మంది రైతులకు 90శాతం సబ్సీడీతో డ్రిప్ ఇరిగేషన్ అందించామన్నారు. హార్టికల్చర్ హబ్‌గా అనంతను అభివద్ధి చేశామని తెలియజేశారు. అరటి రైతుల ఆదాయం రెట్టింపు చేశామన్నారు. కరవు వస్తే ఒకే ఏడాది రూ.2వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సీడీ అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. రోడ్లు, బ్రిడ్జిలు, తాగు, సాగు నీటి ప్రాజెక్టులను టిడిపి హయాంలో చేపట్టామన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకాగానే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగికి ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భతి కల్పిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో టిడ్కో గృహాలను పేదలకు అందజేసి గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. కదిరి లాంటి ప్రాంతంలో మహిళలు, యువత ఉపాధి కోసం గల్ఫ్‌లాంటి దేశాలకు వెళ్తున్నారని వీరి కోసం స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి ఉపాధి చూపుతామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామన్నారు. అనంతలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తామని పునరుద్ఘాటించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బాబు సూపర్-6, బిసి డిక్లరేషన్ తదితర హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిచేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పవన్‌కుమార్‌రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై విమర్శలు

లోకేష్ ప్రసంగంలో ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యేపై లోకేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఏకంగా బ్యాంకులకే టోపీ పెట్టారన్నారు. రూ.1974 కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టారన్నారు. రేపోమాపో ఆయన జైలుకు వెళ్తాడన్నారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యేను కాదని ఎవరూ లేఅవుట్ వేయలేని పరిస్థితి ఉందన్నారు. ఇక కదిరి ఎమ్మెల్యే సైతం సోలార్ పార్కులో పని చేస్తున్న ఏజెన్సీల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. కదిరి లక్ష్మినరసింహ స్వామి ఆలయం డబ్బులను కూడా కాజేశారని విమర్శించారు.

అనంత అభివృద్ధి ఎంత..!

- ఎన్నికల హామీగానే అండర్ డ్రైయినేజీ
- పరిష్కారం కాని డంపింగ్ యార్డు సమస్య
- చిన్న రోడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎంత జరిగింది... ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలు లభించాయా.. అన్న చర్చ అంతటా నడుస్తోంది. ఎందుకంటే ఎన్నికల సమయం వచ్చిందంటే ఆయా పార్టీలు పోటీలు పడి హామీలిస్తుంటాయి. వాటి అమలు ఎంత వరకన్నది తెలియని పరిస్థితులుంటాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో చూసినప్పుడు ఇక్కడ ఏ మేరకు నగరాభివృద్ధి జరిగిందన్న చర్చ నడుస్తోంది. ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలు ఎంత వరకొచ్చాయన్నది కూడా చూడాల్సి ఉంటుంది.

ఎన్నికల హామీలుగా అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ

మూడు లక్షల వరకు జనాభా కలిగిన అనంతపురం నగరంలో అండర్ డ్రైయినేజీ ఇప్పటికీ లేదు. ప్రతి ఎన్నిక సమయంలోనూ ప్రధాన పార్టీల నాయకులందరూ ప్రధానంగా దీనిపైనే హామీనిస్తుంటారు. ఓపెన్ డ్రైయినేజీతో దోమలు, మురుగు సమస్య ఉంటోంది... కాబట్టి అండర్ డ్రైయినేజీని తీసుకొస్తామని చెబుతుంటారు. అయితే ఇది ఇప్పటి వరకు ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. 2009, 2014, 2019 ఎన్నికల సమయంలో ఈ హామీని అభ్యర్థులు ఇచ్చారు. దీని ఆచరణ, అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రాథమిక దశ కూడా దాటిన దాఖలాలు లేవు.

ఇటీవల అనంతపురం డంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలు (ఫైల్ ఫొటో)

డంపింగ్ యార్డు ప్రధాన సమస్య

అనంతపురం నగరంలో రోజుకు వంద టన్నులపైగా చెత్త వస్తోంది. దీన్ని నగర శివారుల్లోని మార్కెట్‌యార్డు వద్ద వేస్తుంటారు. ఎప్పుడో నగరం చిన్నగా ఉన్నప్పుడు పెట్టిన ఈ యార్డులోనే చెత్త వేస్తుండటంతో పేరుకుపోయి కొండలా తయారయింది. దీన్ని ప్రాసెసింగ్ చేసి తగ్గించే చర్యలు కొంత చేపట్టిన పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చుట్టూ జనావాలు కూడా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయి. దీన్ని సుదూర ప్రాంతానికి తరలిస్తామని ఇచ్చిన హామీ అమలు జరగలేదు.

ప్రధాన రహదారుల విస్తరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

అనంతపురం నగరంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పాతూరులోని గాంధీ బజారు, తిలక్ రోడ్డులో రద్దీ ఎక్కువగా ఉంది. దీని విస్తరణ చేపట్టలేదు. కనీసం ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించిన దాఖలాల్లేవు. శాంతినర్సింగ్ హోమ్ ముందు నుంచి గుత్తి రోడ్డు కలిపే రహదారి మధ్యలోనే ఆగింది. దానికి పరిష్కారం చూపలేని స్థితిలో పాలకులున్నారు. ఇది పూర్తయితే పైన పేర్కొన్న రహదారుల్లో రద్దీని తగ్గించేందుకు వీలుంటుంది.

కొన్నింటికి పరిష్కారాలు

ఈ ఐదేళ్ల కాలంలో కొన్నింటికి పరిష్కారాలను అయితే చేపట్టగలిగారు. ప్రధానంగా అనంతపురం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్ద పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నాలుగు లైన్లతో పూర్తి చేయగలిగారు. ఈ రహదారి మొత్తాన్ని ముందనుకున్న విధంగా విస్తరించలేకపోయినా చాలా వరకు పనిని మాత్రం పూర్తి చేయగలిగారు. అదే విధంగా గుత్తిరోడ్డును నాలుగు లైన్ల రహదారిగా రూపొందించారు. వీటితోపాటు ప్రధాన రహదారులను కొంత వరకు మెరుగు చేపట్టగలిగారు. రాజీవ్‌కాలనిలోనూ ప్రధాన రహదారుల నిర్మాణం ఈ ఐదేళ్ల కాలంలో పూర్తి చేయగలిగారు.

మహా శివరాత్రి శుభాకాంక్షలు : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లా ప్రజలందరికీ ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. జాగరణ, శివ పార్వతుల కళ్యాణం, తదితర వేడుకల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శైవ ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టారు. మహా శివరాత్రి ఉత్సవాలు జరిగే దేవాలయాలు, ప్రదేశాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ టనలు తలెత్తకుండా బందోబస్తుతోపాటు ఆయా పరిసరాల్లో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా వేసినట్లు తెలిపారు.

మహిళలు శక్తివంతంగా ఎదగాలి

- స్త్రీలను గౌరవిస్తేనే దేశాభివృద్ధి
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత స్థానాల్లో నిలిచేలా ఎదగాలని జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నాడు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్ అధ్యక్షతన ఎన్జీవో హోంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసూన, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ నేటికీ సమాజంలో మహిళలు వివక్ష, హింసలకు గురి అవుతుండడం విచారకరం అన్నారు. ఇంటి నుంచే స్త్రీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాలక ప్రభుత్వాలతో పాటు తోటి సమాజం స్త్రీని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను గౌరవిస్తే ఆ ప్రాంతం, దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా విద్యనభ్యసించి అగ్రస్థానంలో నిలవాలన్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ మహిళా దినోత్సవం వేడుకలా కాకుండా దీక్షా దినంగా జరుపుకోవాలన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే మహిళా దినోత్సవం ఏర్పడిందని గుర్తు చేశారు. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దనగౌడ్, శీలా జయరామప్ప ముఖ్య అతిథుల సూచనల మేరకు మున్ముందు ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ప్రత్యేకంగా మహిళామణుల ఆధ్వర్యంలోనే వినూత్న పద్ధతిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మహిళలను డాక్టర్ ప్రసూన చేతుల మీదుగా దుస్సాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైసింగ్ కార్యదర్శి ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా ఈసీ మెంబెర్స్ నాగరాజేశ్వరి, సావిత్రి దేవి, ఆదిలక్ష్మి, కోశాధికారి రామకష్ణ, ఉపాధ్యక్షులు తిప్పన్న, రమేష్, దేనియల్ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులు క్రిష్టప్ప, చంద్రశేఖర్ రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సన్మానిస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

మందుబాబులకు అడ్డాగా కళాశాల

- పడిపోయిన ప్రహరీ.. విరిగిన గేట్-రాత్రిళ్లు అసాంఘిక కార్యక్రమాలు
- నార్పల జూనియర్ కళాశాలలో పరిస్థితి-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-నార్పల

మందుబాబులు, ఆకతాయిలకు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల అడ్డాగా మారింది. కళాశాల చుట్టూ ఉన్న ప్రహరీ పడిపోవడంతోపాటు మెయిన్ గేట్ విరిగిపోవడంతో రాత్రి కాగానే కళాశాల ఆవరణ మొత్తం ఆకతాయిలు, మందుబాబులతో నిండిపోతోంది. ఇక కళాశాలకు సెలవులు వస్తే మాత్రం రేయింబవళ్లు ఆకతాయిల చేష్టలు మితిమీరిపోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో జూనియర్ కళాశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు కనీసం కూర్చోవడానికి కూడా గదులు లేకపోయేవి. పలువురు పూర్వ విద్యార్థులు, అప్పటి కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు కలిసి కళాశాల దుస్థితిని ఆర్డీటీ సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో ఐదేళ్ల క్రితం సుమారు రూ.కోటి ఖర్చు చేసి అధునాతనమైన భవనాలను నిర్మించారు. అప్పటినుంచి విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు తీరాయని చెప్పవచ్చు. అయితే కొద్ది కాలం క్రితం కళాశాల చుట్టూ దుగుమర్రి రోడ్డు వైపు ఉన్న ప్రహరీ పోయింది. దీనికితోడు కళాశాల మెయిన్ గేటు సైతం విరిగిపోయింది. అప్పటి నుంచి కళాశాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని చెప్పవచ్చు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు ఆకతాయిలు, మందుబాబులు రాత్రిళ్లు కళాశాలలోకి చేరి వారి చేయని పనులు లేవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా ఎప్పుడు ఎక్కడ ఏం గొడవలు చోటు చేసుకుంటాయో.. అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ గోడను నిర్మించడంతోపాటు ప్రధాన గేట్‌ను రిపేరి చేసి ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలను అరికట్టాలని విద్యార్థులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

కళాశాల వెనుకవైపు కూలిన ప్రహరీ

రైతులకు నష్టదాయకం.. బోర్‌వెల్ అసోసియేషన్ నిబంధనలు..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలతో కలిపి బోర్‌వెల్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అసోసియేషన్ నిబంధనల మేరకు ఈ ఐదు మండలాల్లో నియోజకవర్గంలోని బోర్‌వెల్ లారీలతో మాత్రమే బోర్లు వేయించుకోవాలి. బయట వ్యక్తులు వచ్చి బోరు వేస్తే అసోసియేషన్ సభ్యులు పోలీసులకు పట్టించడం, రెవెన్యూ వారితో జరిమానా వేయించడం, తదితర సమస్యలు సృష్టిస్తున్నారు. అసోసియేషన్‌లోని బోర్‌వెల్ లారీలు సమయానికి రాకపోగా వేరే వారిని పిలిస్తే వారిని రానివ్వడం లేదు. దీంతో భూగర్భ జలాలు ఉండి రైతులు బోర్లు వేసుకోలేకపోతున్నారు. మరోవైపు బయటి ప్రాంతాల్లో అడుగు రూ. 95తో కేసింగ్ రూ. 250 చొప్పున బోర్లు వేస్తుండగా రాయదుర్గం అసోసియేషన్ వారు మాత్రం అడుగు రూ. 110తో కేసింగ్ రూ. 300 చొప్పున వసూలు చేస్తున్నారు. బోరు వేసేందుకు సకాలంలో రాకపోవడంతో రైతులు పంటలు నష్టపోతున్నారు. అసోసియేషన్ సభ్యు లకు భయపడి మండలంలో బోర్లు వేసేందుకు బయటి వ్యక్తులు రావడంలేదు. కావున రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎవరితోనైనా బోరు వేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవా లని మండల రైతులు కోరుతున్నారు.



ఓ రైతు పొలంలో బోరు వేస్తున్న దృశ్యం

సిఎం జగన్‌పై టిడిపి గ్లోబల్ ప్రచారం

వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సీఎం జగన్‌కు రాష్ట్రంలో వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక టిడిపి నాయకులు గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీ తలారి రంగయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలకు వస్తున్న జనాన్ని చూసి టిడిపి, చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం పేదల దరి చేరాయన్నారు. ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు పెద్దపీట వేశారన్నారు. ఇకపోతే నేడు కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్నారన్నారు. కావున నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గుంతకల్లు ఎమ్మెల్యేలతో ఎలాంటి విభేదాలు లేవు

గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డితో ఇలాంటి విభేదాలు లేవని ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు స్పష్టం చేశారు. పామిడిలో జరిగిన ఆసరా కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖితను సమయాభావం లేకపోవడం వల్ల మాట్లాడేందుకు వీలు కాలేదన్నారు. ఈ విషయంపై మాట్లాడినందుకు ప్రతిపక్ష మీడియా సామాజిక మాధ్యమంలో తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిన్నచిన్న సమస్యలు తలెత్తడం సహజమే అన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం టిడిపిలో చేరాక ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సి.రెడ్డి భీమిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, ఎంపిటిసి నరసాపురం సూరిబాబు, గోళ్ల సూరి, ఒంటిమిట్ట స్వామి, జయం ఫణి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య

సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలన

వై.విశ్వేశ్వరరెడ్డి,శంకరనారాయణ

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలన సాగుతోందని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త వై.శంకరనారాయణ అన్నారు. శుక్రవారం కూడేరు మండలంలోని పి.నారాయణపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.70 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టు నిర్మించినట్లు తెలిపారు. మరోవైపు సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అభివృద్ధికి కృషి చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణరెడ్డి, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, నిర్మలమ్మ, సుబ్బమ్మ, తుప్పటి హరీష్, చంద్రశేఖర్, సుబ్బర ఎర్రిస్వామి, గోవిందరెడ్డి, ఈశ్వరరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, సుబ్బర శ్రీధర్, హరి, శివ, రామాంజినేయులు, మురళి, కమ్మే రామాంజినేయులు, కుమ్మతి ముత్యాలురెడ్డి, మాధవరెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, ఓబుళమ్మ, పద్మావతి, బోయ నరేష్, ఎంఎం హళ్లి ఎర్రిస్వామి, ఆదినారాయణ, బొమ్మయ్య, శీనా, రామాంజినేయులు, ఆంజనేయ, భార్గవ్, మర్రిస్వామి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి,శంకరనారాయణ

ఘనంగా శివరాత్రి వేడుకలు

నార్పల శివాలయంలో భక్తుల సందడి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శివాలయ ఆవరణలో శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగ సాగింది. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. రాత్రి హరికథ పారాయణంతో పాటు చింతామణి డ్రామా వేశారు.

పుట్లూరు : శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఇందులో భాగంగా భక్తులు ఉదయమే ఆలయాలకు పోటెత్తారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందించారు. పుట్లూరు, నాయకునిపల్లి వివిధ శివాలయాల వద్ద అన్నదానం చేశారు.

బెళుగుప్పలో శివపార్వతుల కళ్యాణం చేస్తున్న అర్చకులు

బెళుగుప్ప : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు తగ్గుపర్తి, సీర్పి, శ్రీరంగాపురంలో ఉన్న ఆలయాల్లో శుక్రవారం శివపార్వతుల కళ్యాణం కమణీయంగా సాగింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, నైవేద్యం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

శింగనమల : మండలం చిన్న జలాలపురం గ్రామంలో వెలిసిన ధనరామేశ్వరస్వామి సన్నిధిలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సుబ్బరంగాయ్య స్వాములు ఆధ్వర్యంలో జలాభిషేకంతో పూజలు ప్రారంభమై రుద్రాభిషేకం, వివిధ అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు వెన్నపూస రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. చిన్న జలాలపురం ధన రామేశ్వర స్వామి భక్తమండలి ఆధ్వర్యంలో భజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న జలాలపురం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. బొమ్మనహాల్, నేమకల్లు, ఉద్దేహాల్, శ్రీధరఘట్ట, కొలగానహళ్లి, సింగానహళ్లి, బొల్లనగుడ్డం, కురవల్లి, సిద్ధరాంపురం, గోనెహాల్, ఉప్పరహాల్, తదితర గ్రామాల్లో శివాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. భక్తజనసందోహం మధ్య శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. రాత్రికి జాగారం సందర్భంగా భక్తుల కోసం పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మిక, భజన, పౌరాణిక నాటకాలు, చెక్కభజనలు, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శివాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

వికలాంగుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

విలేకరులతో మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి హెచ్.రామయ్య

రాజకీయ పార్టీల నాయకులు వికలాంగుల సమస్యలను మేనిఫెస్టోల్లో చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి హెచ్.రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది వికలాంగులు ఉన్నారన్నారు. వీరంతా అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా నిరుద్యోగం వేధిస్తోందన్నారు. వికలాంగులకు కొద్దో గొప్పో భద్రత ఉన్న వికలాంగుల చట్టం సైతం సరిగా అమలు కావడం లేదన్నారు. ఉన్న పథకాలు అమలు కాకపోవడంతో చేయూత కరువైందన్నారు. ఇక వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. ఈ సమయంలో వికలాంగులకు అన్నివిధాలా అండగా నిలిచే వారికే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందన్నారు. తమ సమస్యలను మేనిఫెస్టోల్లో ఉంచి అధికారంలోకి వస్తే అమలు చేస్తామని హామీ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో వికలాంగుల సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఓబులేసు, గంగన్న, రామాంజనేయులు, పద్మావతి, రాజశేఖర్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

11న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-ఉరవకొండ

కరపత్రాలు విడుదల చేస్తున్న గాంధీ హరిజన హాస్టల్ కమిటీ దళిత నాయకులు

పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 11న అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు గాంధీ హరిజన హాస్టల్ కమిటీ దళిత నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో ఉండే గాంధీ హరిజన హాస్టల్ పేరును 1941 నుంచి 2008 వరకూ ఎలాగైతే ఉందో అదేవిధంగా అడంగల్‌ను ముందు మాదిరిగానే ఆన్‌లైన్‌లో పొందు పరచాలని డిమాండ్ చేశారు. ఎస్సీల అభివృద్ధి కోసం ఆ స్థలాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో గత ఆరేళ్ల నుంచి పోరాటం చేస్తున్న స్థానిక రెవెన్యూ అధికారులు తహశీల్దార్లు, ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్ పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంభించినందుకు నిరసనగా కలెక్టరేట్ కార్యాలయం ముందు వంటావార్పు చేపట్టిన నిరసన తెలపనున్నట్లు తెలిపారు. కావున వివిధ గ్రామాల నుంచి దళితులు, దళిత మేధావులు కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీ హరిజన హాస్టల్ కమిటీ దళిత నాయకులు మీనుగ గోపాల్, లత్తవరం చంద్రశేఖర్, బెంజిమెన్, కోళ్ల ఏసన్న, రవీంద్ర, రాజు, రాకెట్ల బాబు, కోళ్ల శరత్, కట్ల ఓబులేసు, కిషోర్, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No.1545/22

శ్రీమతి సిద్ధవటం సావిత్రమ్మ. ...వాది

వర్సెస్

శ్రీమతి ఆవుల రామ లక్ష్మమ్మ వగైరా. ...ప్రతివాదులు

ఐదవ ప్రతివాదికి దావా సమన్లు

మన్నె వెంకట రామిరెడ్డి తండ్రి మన్నె నాగిరెడ్డి,
చిక్కేపల్లి గ్రామము, నిట్టూరు పోస్టు,
యాడికి మండలం, అనంతపురం జిల్లా.

పై నెంబర్ దావాలో వాది దావా షెడ్యూలు ఆస్తిలో 1/2 భాగం భాగపరిష్కారం కోరి డిగ్రీ ఇప్పించమని (2) ఐదో ప్రతివాది పైన డిగ్రీ మేరకు అడ్వకేట్ కమిషనరును వేసి భాగ పరిష్కారం చేసి ఇవ్వమని (3) 20-12-2018వ తేదీవ తేది పేరం అక్కమ్మ 1వ ప్రతివాది పేర వ్రాయించి ఇచ్చిన దాన దస్తావేజు రద్దు చేయమని (4) కోర్టు ఖర్చులు ఇప్పించమని, దావా దాఖలు చేసినది. ఇందులో ఐదవ ప్రతివాది అయినా నీ ఆక్షేపణలు ఉన్న 26-04-2024వ తేదీ పగలు 10:30 లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు

1) కర్నూలు డి॥ కర్నూలు సబ్ డి॥ లో కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ లోని కర్నూలు గ్రామంలో సర్వేనెంబర్ 781/సి/బి ఇంటి స్థలం విస్తీర్ణం 03 సెంట్లు తూర్పు : కాలి స్థలం, పడమర : సిద్ధవటం సావిత్రమ్మ స్థలం, ఉత్తరం : దాదాపు కుని లక్ష్మన్న 50 అడుగుల రోడ్డు

2) కర్నూలు డి॥ కర్నూలు సబ్ డి॥లో కర్నూలు గ్రామం మద్దూరు నగర్ పూల కొట్టాలు ఇంటి నెంబర్ 49/5023 య 1-25 సెంట్లు లో నిర్మాణం ఉన్న ఇల్లు క్రింద భాగం 1వ అంతస్తు తూర్పు: శేషన్న ఇల్లు, పడమర : రోడ్డు, ఉత్తరం : రోడ్డు, దక్షిణం: నాయకల్లు ఇల్లు

3) అనంతపురం జిల్లా యాడికి సబ్ డి॥ లో నిట్టూరు గ్రామం సర్వేనెంబర్ 384/బి మరియు 385 మొత్తం విస్తీర్ణం య. 3.35 సెంట్లు తూర్పు: ఆవుల సూర్యనారాయణ రెడ్డి భూమి, పడమర : దూదేకుల నాగప్ప భూమి, ఉత్తరం: మన్నే నాగిరెడ్డి భూమి, ఉత్తరం: గొల్ల శేషన్న భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ : 26-04-2024

పి.సువర్ణారెడ్డి,
వాదిపురం అడ్వకేటు,
కర్నూలు

15న బహుజనభేరి

ప్రజాశక్తి-గుత్తి

విజయవాడలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న బహుజన భేరి సభను జయప్రదం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఛాన్స్ ఇవ్వండి అంటూ జగన్ గద్దెనెక్కి ప్రజలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఐదేళ్లలో రాష్ట్రానికి ఏమి చేయ లేదన్నారు. ఏపీలో బీఎస్పీ అధికారం చేపట్టితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకటయ్య, నియోజకవర్గ కన్వీనర్ బి.వెంకటకొండయ్య, అధ్యక్షులు విజయ్, నాయకులు ఎం.రామాంజినేయులు, ఎం.రంగనాయకులు, కరీం సాబ్, ఓబులేసు, రామాంజినేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు

అనంతపురం వైసిపి కార్యాలయంలో కేక్ కోస్తున్న మహిళలు

గుత్తిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహిళా దినోత్సవంలో వక్తలు

గుత్తి : మహిళలు అన్నిరంగాల్లో విజయం సాధించాలని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం వద్ద సంస్థ అధ్యక్షురాలు అలివేలమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఎదుగుదలకు తోడ్పాటును అందిస్తామన్నారు. మహిళలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రివెన్షన్స్ యూనిట్ ప్రతినిధి కవిత, అకౌంటెంట్ భాగ్యలత, గుత్తి, నందికొట్కూరు, పత్తికొండ, డోన్ మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

డాక్టర్ శాంతిప్రియకు సన్మానం

వైద్యరంగంలో ఉంటూ సామాజిక సేవలు చేస్తున్న శాంతిప్రియ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.శాంతిప్రియను శుక్రవారం ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే అంగన్వాడీ కార్యకర్త నాగమ్మ, ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, వెంకట సుబ్బమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, శాంతి ప్రియ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : పార్టీ, ప్రభుత్వం, సంక్షేమ పథకాల అమలులో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ,

మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి మండలం పెన్నా సిమెంట్ కర్మాగారంలో పాల్గొన్న మహిళలు

ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, మహిళా నేతలు కృష్ణవేణి, రాధాయాదవ్, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : మండలంలోని తలారిచెరువు గ్రామ సమీపంలో ఉన్న పెన్నా సిమెంట్ కర్మాగారంలో పెన్నా రిక్రియేషన్ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. అలాంటి మహిళలకు ప్రతి కుటుంబంలో సహకారం అందించాలన్నారు. అనంతరం మహిళలకు వివిధ ఆటల పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో

పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్స నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి గౌరవాధ్యక్షులు రవికాంత్ రమణ, ప్రముఖ నాట్యాచార్యులు జి.సంధ్యామూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంధ్యామూర్తి మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ప్రధాన కార్యదర్శి వివిఎంపి.నాయుడు, దేవరకొండ కొలాట కౌసల్య, యోగా మాస్టర్ క్రిష్ణవేణి, సుగుణమ్మ, శ్రీదేవి, జ్యోతి, విజయలక్ష్మి, వరలక్ష్మి, ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజినేయులు, ఆదినారాయణ, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, సర్దార్‌బాబు, వలి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో సహకరించండి

నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి ఇంట్లో జరిగిన విషయంపై దళిత సంఘాల నాయకులు ఆరోపణలు చేయకుండా సహకరించాలని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఒక కుటుంబం లాంటి టిడిపిలో అంతర్గతంగా కొన్ని విభేదాలు ఉంటాయన్నారు. అంతమాత్రాన లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడుపై అనవసరం ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ముఖ్యంగా దళితులను ఎమ్మెల్యేలు, స్పీకర్లు, మంత్రులను చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. అలాంటి పార్టీని 2024 ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్న చిన్న గొడవలను పక్కన పెట్టి అందరం కలిసికట్టుగా పని చేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.

రెడ్ల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వాలు రెడ్ల సంక్షేమానికి పెద్దపీట వేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెడ్లు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరు డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల రెడ్డి కులస్తులు ఉన్నారన్నారు. రెడ్లలో చాలామంది నిరుపేదలు ఉన్నారన్నారు. నిరుద్యోగ రెడ్డి యువతకు రెడ్డి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, పేద రెడ్డి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహకారం అందించాలని, రైతులకు ఎరువులు, మందులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను ఉచితంగా అందజేయాలని, రెడ్డి భవనాలు నిర్మించుకునేందుకు భూములు, నిధులు కార్పొరేషన్ ద్వారా కేటాయించాలని, జనవరి 19న ప్రజాకవి యోగివేమన జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, భారత రాష్ట్రపతిగా ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా సేవలందించిన నీలం సంజీవరెడ్డి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి భారతరత్న ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని డిమండ్ చేశారు. ఆయా డిమాండ్లను ఆయా రాజకీయ పార్టీల నాయకులు మేనిఫెస్టోల్లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆత్మకూరు రామకృష్ణారెడ్డి, నాయకులు గతిరెడ్డి భయపరెడ్డి, ఫైర్ కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, హనుమంతురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అరవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న రెడ్డిసంఘం నాయకులు

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

సింగంపల్లిలో

'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి నేత ధర్మవరం బాలాజీ, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాబోయేది మన చంద్రన్న ప్రభుత్వమే అన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పరిటాల కుటుంబాన్ని భారీ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ప్రతిష్టను పెంచుదాం

ఎపిజిఇఎఫ్ ఛైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఉత్తమమైన సేవలు ప్రజలకు అందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టను పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన రోడ్లు భవనాల శాఖ సమావేశ మందిరంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ స్వరాజ్య స్థాపన కోసం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఆ మేరకు ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పరిపాలన అందుబాటులోకి తెచ్చి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకే చేరువ చేస్తోందన్నారు. అందులో సచివాలయ ఉద్యోగులు ఎంతో కీలకంగా పని చేస్తున్నారని అభినందించారు. రాబోయే కాలంలో మరింత సేవలు అందించి ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఈఎఫ్ జనరల్ సెక్రటరీ అరవ-పాల్, గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ (13/2020) జిల్లా అధ్యక్షులు ఎం.వీరనారాయణ, రాష్ట్ర సెక్రటరీ బి.రామక్రిష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.సుధాకర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి రూరల్ : పట్టణంలో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీషర్లపై దండయాత్ర చేసి వీరమరణం పొందిన ప్రథమ భారత స్వాతంత్ర్యయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. అలాంటి ఆ మహనీయుడిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, నాయకులు కందికాపుల మురళీధర్‌రెడ్డిరెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఇగుడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతుకూ అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించడానికే సిఎం జగన్ రైతుభరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుడికి ముందస్తు నోటీసు

ఎంఆర్‌పిఎస్ నాయకులు ఓబులేసుకు వినతిపత్రం సమర్పిస్తున్న పోలీసులు

శింగనమల : విజయవాడలో జరుగే వికలాంగుల మహాగర్జనకు వెళ్లకూడదని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నజలాలపురం ఓబులేసుకు పోలీసులు శుక్రవారం ముందస్తు నోటీసు అందజేశారు. విజయవాడ మహాగర్జనతోపాటు ఎలాంటి సభలు, సమావేశాలకు హాజరుకాకూడదని ఓబులేసును శింగనమల పోలీస్‌స్టేషన్‌ను పిలిపించుకుని నోటీసు అందజేశారు. నోటీసును అతిక్రమిస్తే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

నింబగల్లులో వైసిపి ప్రచారం

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ఉరవకొండ : మండలంలోని నింబగల్లు గ్రామంలో వైసిపి ఎస్సీ విభాగం నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఎమ్మెల్యే అభివృద్ధి వై.విశ్వేశ్వరరెడ్డిని, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్సీ విభాగం నాయకులు వెలిగొండ ఓబయ్య, పెద్ద ముష్టూరు గోవిందు, చిన్న ముష్టూరు అశోక్, ఇంద్రావతి సుంకన్న, రాకెట్ల ఓబయ్య, మూలగిరిపల్లి రామాంజనేయులు, బసవరాజు, ఉరవకొండ విజయ్, శ్యామ్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రామాపురం విద్యార్థిని

బత్తలపల్లి : అంతర్ రాష్ట్రాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ నెలలో22 నుండి 24 వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచిన తమ పాఠశాలకు చెందిన మౌనిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల10 నుంచి 14 వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆమె పాల్గొంటుందన్నారు.

ప్రత్యేక సంచిక తీసుకురావడం అభినందనీయం

హిందూపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి దిన పత్రిక ప్రత్యేక సంచికను తీసుకు రావడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, జిల్లా మహిళ సభ్యురాలు నాగమణి, ఎన్‌జిఒ నాయకులు నరసింహులు మాట్లాడుతు ప్రతి అక్షరం ప్రజల పక్షం అన్న నినాదంతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు బడుగు బలహీన నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేక కథనాల పేరుతో ప్రజాశక్తి వెలుగులోకి తీసుకువస్తోందన్నారు. ఈ కార్యక్రమంలోఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణవేణి, మండల ఉపాధ్యక్షురాలు రంగమ్మ, మహిళ ఉపాధ్యాయులు శంకరమ్మ, శ్రీ లత, పద్మజ, లీలావతి, వాణి, జ్యోతి, వీణ, జ్యోతిర్మయి, రాజేశ్వరి, సౌజన్య, ఉపాధ్యాయులు జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రాందాస్ నాయక్, ప్రజాశక్తి విలేకరి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పుట్టపర్తి అర్బన్ : ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీలు కల్ప లతా రెడ్డి, ఎంఇ. రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామం అతిథిగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాల ఉద్యోగ ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సచివాలయాల అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నో సౌకర్యాలు కల్పించారన్నారు.

క్వారీలో పేలుడు -మహిళ మృతి

ప్రజాశక్తి-లేపాక్షి

క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. ఎలాంటి ముందస్తు రక్షణ చర్యలు లేకుండా క్వారీలో పేలుళ్లను చేయడంతో బండరాళ్లు ఎగిసి పడ్డాయి. పెద్ద బండరాళ్లు రేకుల షెడ్డుపై పడి, అందులో ఉన్న మహిళపై పడడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటన క్వారీ యజమానులు చేస్తున్న అక్రమ పేలుళ్లకు అద్దంపడుతోంది. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... లేపాక్షి మండల పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ బయన్నపల్లి గ్రామం సమీపాన గ్రానైట్ క్వారీ ఉంది. క్వారీ సమీపంలో అందులో పని చేసే మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన ఈడిగ కిష్టమ్మ(55) కుటుంబంతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం నాడు క్వారీలో బండలను పగులగొట్టడానికి తూటాలతో పేలుళ్లు జరిపారు. ఈ దాటికి పెద్ద బండరాళ్లు కిష్టమ్మ ఉన్న రేకుల షెడ్డుపై పడ్డాయి. ఈసమయంలో వంటగదిలో వంట చేస్తున్న ఆమెపై బండరాళ్లు పడడంతో అక్కడికక్కడే మరణించింది. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో పేలుళ్లు జరుపుతున్నారని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ వద్ద మహిళ మృతి విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.